# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు రైతులు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**

2. **పిఠాపురాన్ని మరింత పచ్చగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దే దిశగా పీఠికాపుర వనం కీలక ముందడుగు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

3. **వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.**

4. **మహాకవి గురజాడ అప్పారావు రచనలు సమాజంలో చైతన్యాన్ని కలిగించాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

==========================

సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు రైతులు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఈరోజు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుప్పం నియోజకవర్గంలో సుమారు 289 కోట్ల 50 లక్షల రూపాయల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, మరో 38 కోట్ల 50 లక్షల రూపాయల విలువైన పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం కుప్పంలో నిర్వహించిన బహిరంగ కార్యక్రమంలో రైతులు, మహిళలు, ఉద్యోగులు, యువత, వివిధ పథకాల లబ్ధిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖాముఖి మాట్లాడారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

--------------------------

పిఠాపురాన్ని మరింత పచ్చగా, పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దే దిశగా పీఠికాపుర వనం కీలక ముందడుగు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం రెండు రోజుల పర్యటనలో భాగంగా నూతనంగా అభివృద్ధి చేసిన పీఠికాపుర వనం నగర వాటికను ఈరోజు ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మొక్కను నాటి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం పీఠికాపుర వనంలో అభివృద్ధి చేసిన ఉద్యానవనాలు, ప్రజా సౌకర్యాల ఫొటో ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, పిఠాపురం ప్రజలకు నడక, వ్యాయామం, వినోదం, విశ్రాంతికి ఈ వనం ఉపయోగపడనుందని చెప్పారు. పాదగయ క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు అదనపు ఆకర్షణగా, విద్యార్థులకు పర్యావరణ విద్య, ప్రకృతి అధ్యయనం, జీవవైవిధ్యంపై అవగాహన కల్పించే కేంద్రంగా కూడా ఉపయోగపడుతుందని తెలిపారు.

-------------------------

ప్రపంచంలోని 163 దేశాలకు చెందిన వెయ్యి నగరాలను విశ్లేషించిన ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్-2026 సూచికలో రాష్ట్రంలోని పలు నగరాలు ర్యాంకులను పొందాయి. వీటిలో గుంటూరు 739వ ర్యాంకు, విశాఖపట్నం 755వ ర్యాంకు, నెల్లూరు నగరం 893వ ర్యాంకు, విజయవాడ 932వ ర్యాంకులను పొందాయి. ఆర్థిక వ్యవస్థ, మానవ మూలధనం, జీవన నాణ్యత, పర్యావరణం, పాలన వంటి ఐదు ప్రధాన అంశాల ఆధారంగా నగరాలను ఈ సూచికలో విశ్లేషించారు.

దీనిపై పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్పందిస్తూ.. నగర అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్టంలోని నగరాలను ఆధునిక, సుస్థిర నగరాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

-------------------------

వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి, జిల్లాలో వాతావరణ పరిస్థితిపై ఈరోజు సమీక్షించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో లోతట్టు, తీర ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైతే ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, కాలువలు, నదులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

-------------------------

మహాకవి గురజాడ అప్పారావు రచనలు సమాజంలో చైతన్యాన్ని తీసుకొచ్చాయని రాష్ట్ర పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలోని గురజాడ స్వగృహంలో నిర్వహించిన గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, గురజాడ రాసిన నాటకాలు, కవితలు, రచనలు సమాజంలో చైతన్యాన్ని తీసుకొచ్చాయని అన్నారు. గురజాడ రచించిన “దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్” అనే సందేశాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా కొనియాడారని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

-------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్' ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలో అంకుర సంస్థల బలోపేతం కోసం ప్రవేశపెట్టిన స్టార్టప్ ఇండియా కార్యక్రమం గురించి ఈరోజు తెలుసుకుందాం.

దేశంలో అంకుర సంస్థల వ్యవస్థాపకతను ప్రోత్సహించే దిశగా 2016లో ప్రారంభమైన స్టార్టప్ ఇండియా కార్యక్రమం దేశాభివృద్ధిలో కీలకంగా మారింది. సుమారు 400 గుర్తింపు పొందిన స్టార్టప్‌లతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రస్తుతం 2 లక్షలకు చేరుకుంది. ఈ అంకుర సంస్థల ద్వారా దేశవ్యాప్తంగా 23 లక్షలకుపైగా ప్రత్యక్ష ఉద్యోగాలు ఏర్పడ్డాయి. ఇక చిన్న వయస్సులోనే ఆవిష్కరణలపై ఆసక్తిని పెంచేందుకు దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. స్టార్టప్ రంగంలో మహిళల భాగస్వామ్యం కూడా పెరుగుతోంది. స్టార్టప్ ఇండియా కార్యక్రమంతో ఉద్యోగాల సృష్టి, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. మరోవైపు... స్టార్టప్ సంస్కృతి మెట్రో నగరాలకే పరిమితం కాకుండా... గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 50 శాతం టైర్-2, టైర్-3 నగరాల నుంచి వస్తున్నాయని ప్రధానమంత్రి తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సంచాలకులు పి. సంపత్ కుమార్ తెలిపారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్మికులకు అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే స్వచ్ఛ భారత్, పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సంపత్ కుమార్ తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

డీఎస్సీ క్రీడా కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయవాడలో ఈరోజు నిరసన కార్యకమాన్ని చేపట్టారు. ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ-శాప్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై శాప్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. డీఎస్సీ నియామకాల్లో అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

=====================